ముక్తిధామం.. ఉత్తర ద్వారదర్శనం



నల్లగొండ్లలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహుడు



ఆత్మకూరు: జేఆర్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



సంగం: ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

వైష్ణవాలయాల్లో స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆత్మకూరురూరల్: వైకుంఠ మార్గం ఉత్తర ద్వారదర్శనంతో ముక్కోటి దేవతల దర్శనం చేసుకున్న పుణ్య ఫలం లభిస్తోందని వేదాల సారాంశం. అటువంటి పవిత్రమైన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువ జామునే ఆలయాల్లో మూలవరులకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఉత్తర ద్వార దర్శనానికి భక్తులకు ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పురాతన ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఉత్తర ద్వారానికి ఎదురుగా ఏర్పాటు చేశారు. జేఆర్‌పేటలోని పద్మావతి, ఆండాల్ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పర్యవేక్షణలో స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనం కల్పించారు. కోదండ రామాలయం, వైశ్యబజార్, పంటవీధిలోని రామాలయాల్లో, కాశీనాయన ఆశ్రమంలోని ఆలయాల్లో ముక్కోటి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, యానాదిరెడ్డి, కంది చంద్రారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక వేణుగోపాల స్వామి ఆలయం, జలదంకిలోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే ఉత్తర ద్వారదర్శనం ద్వారా భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం 6 గంటలకు గోపూజ, 8 గంటలకు గీతా పారాయణం, విష్ణు సహస్రనామ పూజ, అష్టోత్తర పూజ, పూలంగి సేవ తదితర పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, మంత్రపుష్పం, కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి గ్రామోత్సవాన్ని వేడుకగా గ్రామ వీధుల్లో ఊరేగించారు.

వైకుంఠ ద్వార దర్శనం

దుత్తలూరు: మండలంలోని రెడ్లదిన్నె దేవర బోర్డుపై కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ద్వార దర్శనం చేసుకున్నారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో విశేష పూజలు

వరికుంటపాడు: మండలంలోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వరికుంటపాడు, నల్లబోతులవారిపల్లె కోదండరామస్వామి ఆలయాల్లో, తూర్పురొంపిదొడ్ల మానసాదేవి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనంలో స్వామి వార్లను దర్శించుని తన్మయత్వం పొందారు. అర్చకులు స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణలు నిర్వహించి దర్శనం కల్పించారు.

వైభవంగా ఏకాదశి వేడుకలు

వరికుంటపాడు: మండలంలోని పలు దేవాలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. వింజమూరులోని చెన్నకేశవ దేవాలయంలో తెల్లవారు జాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. నల్లగొండ్ల లక్ష్మీనరసింహా దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి.

ఆలయాల్లో భక్తుల రద్దీ

వరికుంటపాడు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. మండలంలోని గండిపాళెం సిద్ధేశ్వరాలయం, రామాలయం, ఉదయగిరి బోయవీధి రామాలయం, శివాలయం తదితర ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

సంగంలో..

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో కొలువైన సీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం పురవీధుల్లో వైభవంగా సాగింది. ముక్తాపురం, సిద్దీపురం గ్రామాల్లోని కోదండ రామస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా ముక్కోటి వేడుకలు

సోమశిల: సోమశిలలో కొలువైన సీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో ముక్కోటి పర్వదినం సందర్భంగా వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన ఆచార్యులు సొట్టు చంద్రమౌళి శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఘనంగా అలంకరించి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. స్థానిక కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం

ఆత్మకూరురూరల్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని మహిమలూరులో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ద్వార దర్శనంతో పాటు విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మెట్టుకూరు రామలింగారెడ్డి, సుప్రజ దంపతులు ఆధ్వర్యంలో స్వామి వారిని విశేష అలంకరణతో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.



ఆత్మకూరురూరల్: విశేష అలంకరణలో వెంకటేశ్వరస్వామి మూలమూర్తి

వైభవంగా ముక్కోటి ఏకాదశి

చేజర్ల: మండలంలోని పలు వైష్ణవాలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. చేజర్లలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. స్వామి శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.



ఆత్మకూరు: వెంకటేశ్వరస్వామి దర్శించుకున్న జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, తదితరులు



చెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గండిపాళెం సిద్ధేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎమ్మెల్యే చొరవతో వరవకాలువ పూడికతీత

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు చెరువు అలుగు జలాలు, పొలాల నుంచి వెలుపలకి వచ్చే మిగులు జలాలు ప్రవహించే వరవ కాలువ పూడిపోయి ముంపు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి రైతులు, ఏపీ రైతు సంఘం నాయకులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి అంచనాలు వేయించారు. ఆ మేరకు పూడికతీత పనులకు రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో శనివారం యంత్రాలతో పనులు ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామం సమీపంలో బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న వరవకాలువలో పనులు జరుగుతున్నాయి. ఈ పూడికతీతతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, వెంకట్రావుపల్లి గ్రామాలకు ముంపు తప్పుతుంది. ఆత్మకూరు– నెల్లూరుపాళెం రహదారి పక్కనే ఉన్న అలుగు నీరు ప్రవహించే రెండో వరవ కాలువ పూడికతీత పనులకు రూ.7 లక్షలు ఇరిగేషన్ అధికారులకు అంచనాలు వేయడంతో త్వరలో ఆ పనులకు నిధులు మంజూరుకానున్నట్లు రైతులు పేర్కొన్నారు.



ఆత్మకూరు బైపాస్‌రోడ్డులోని వరవకాలువలో యంత్రంతో పూడికతీత పనులు చేయిస్తున్న దృశ్యం

వైభవంగా గ్రామోత్సవం



సంగం: మండలంలోని సిద్దీపురంలో కొలువైన హనుమత్ సమేత సీతా రామ లక్ష్మణ స్వామి దేవాలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా విశిష్ట పూజలు నిర్వహించారు. నెల్లూరు రైస్ మిల్లర్స్ డీలర్స్ సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ విశేషంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం



కేతుబోయిన రమేష్



చంద్రా నారాయణ స్వామి



బట్రెడ్డి నరేంద్రరెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతసాగరానికి బట్రెడ్డి నరేంద్ర, అనుమసముద్రంపేటకు కేతుబోయిన రమేష్, చేజర్లకు ఆంద్రా వెంకట రెడ్డి, మర్రిపాడుకు చంద్రా నారాయణస్వామి, సంగంకు ఊటుకూరి జనార్దన్ రెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు అందాయి.

కావలి నియోజకవర్గం..

కావలి: కావలి నియోజకవర్గంలోని బోగోలు మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా మేకల శ్రీనివాసులు, అల్లూరుకు కొండూరు శ్రీనివాసులు, అల్లూరు నగర పంచాయతీకి పరిసినెట్టి రాజేష్, దగదర్తికి వెలినేని మహేష్ నాయుడు, కావలి రూరల్‌కు వాయిల తిరుపతి, కావలి మున్సిపాలిటీకి వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డిలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో వెలువరించింది.

యువత ఫిట్‌నెస్ మంత్ర 'ఆడుదాం ఆంధ్రా'



కొండాపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



వింజమూరులో బంగ్లా సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



అల్లూరు: ఆడుదాం ఆంధ్రాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చేజర్ల: ఆడుదాం ఆంధ్రా ప్రీ ట్రైల్స్ ఆడుతున్న అధికారులు, ఉపాధ్యాయులు

- ఈ నెల 26 నుంచి క్రీడల పండగ
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: మారిపోయిన జీవన శైలితో ముఖ్యంగా యువతలో ఫిట్‌నెస్ కొరవడిందని, క్రీడలతో ఫిట్‌నెస్ పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతకు 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా క్రీడాపోటీలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలతో నూతనోత్తేజం వస్తుందన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 'ఆడుదాం ఆంధ్రా' పండగ వాతావరణంలో కొనసాగుతుందన్నారు. కావలిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్న క్రీడాకారులను గుర్తించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను దేశానికి అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్త క్రీడా టోర్నమెంట్ 'ఆడుదాం ఆంధ్రా'కు శ్రీకారం చుట్టారన్నారు. యువతలో క్రీడా ప్రతిభను పెంపొందించడానికి తొలి దశ పోటీలు గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తారని, ఇక్కడి విజేతలుగా నిలిచిన వారు తర్వాత మండల స్థాయిలో పోటీ పడతారన్నారు. మండలాల్లో గెలుపొందిన జట్లను నియోజకవర్గ పోటీలకు పంపిస్తారన్నారు. నియోజకవర్గాల్లో పోటీలు నిర్వహించి, వీటిల్లో సత్తా చాటిన వారు జిల్లా స్థాయికి ఆడాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాల్లో మ్యాచ్‌లు నిర్వహించి, జిల్లా స్థాయి విజేతలతో రాష్ట్ర స్థాయిలో మ్యాచ్‌ల్లో పోటీ పడేలా షెడ్యూల్ రూపొందిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీకే శీనానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఆడుదాం ఆంధ్రా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సోమశిల: సోమశిలలో ఆడుదాం ఆంధ్రా ర్యాలీ



కలిగిరి: ఆడుదాం ఆంధ్రా ర్యాలీలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి



దుత్తలూరు: సెంటర్లో ఆడుదాం ఆంధ్రా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సంగం: ఎంజీఆర్ సంగం బ్యారేజ్‌పై విద్యార్థులు



క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన మేకపాటి రాజారెడ్డి



గోపవరంలో పరిశ్రమ ప్రారంభోత్సవంలో మేకపాటి రాజారెడ్డి

వరికుంటపాడు: వైఎస్సార్ జిల్లా గోపవరంలో శనివారం పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త మేకపాటి రాజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జలదంకి మండలంలో రైతులు 25 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు అవసరమైన సోమశిల జలాలు విడుదల చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి పలు ప్రతిపాదనలు చేశారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితిని సీఎంకు వివరించారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



పది విద్యార్థులతో ఉపాధ్యాయులు

వరికుంటపాడు: ఉదయగిరి మండలంలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పూర్వపు తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేసిన కె.వాణి సొంత నిధులతో యూటీఎఫ్ రూపొందించిన పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ నాయకులు ఫణీరాజు, సుబ్బరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి అంజయ్య

వరికుంటపాడు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జె.అంజయ్య అన్నారు. ఆయన శనివారం మండలంలోని గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఉదయగిరి న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తెలిసీ తెలియని వయస్సులో తప్పుతోవ పడితే భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తల్లిదండ్రులను, గురువులను, తోటి వారిని గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి.కల్పన, ఎస్‌ఐ కె.ఇంద్రసేనారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ రియాజ్, గ్రామపెద్దలు ఏ వెంకటసుబ్బయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, ఏ.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎస్.రామారావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు యూటీఎఫ్ నేతలు వినతి పత్రం



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సంఘం

ఆత్మకూరు రూరల్: ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి యూటీఎఫ్ నేతలు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని కలిసిన యూటీఎఫ్ నాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. డీఏ అరియర్లు, పీఎఫ్, ఏపీజీఎల్‌ఐ, సరెండర్ లీవ్ గతంలో చెప్పిన మేరకు ప్రభుత్వం నెలనెలా చెల్లించేలా చూడాలని, ఈ మేరకు ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకొని వెళ్లాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు బి శివప్రసాద్, ఎం గంగాధర్, ఏఎస్‌పేట, ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం మండలాల యూటీఎఫ్ లీడర్లు పాల్గొన్నారు.

హజరత్ ఖాదర్‌వల్లి దర్గాలో గంధ మహోత్సవం



చేజర్ల: హజరత్ ఖాదర్‌వల్లి దర్గాలో విద్యుత్ వెలుగుల మధ్య గంధ మహోత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దర్గాను సుందరంగా రంగులతో అలంకరించారు. మంగళవారం తెల్లవారు జామున గంధాన్ని ఒంటెపై గ్రామంలో ఊరేగింపుగా దర్గాకు చేరుకుంటారు. తర్వాత పూజలు అనంతరం గంధాన్ని భక్తులకు పంచుతారు.

శబరిమలకు తరలిన అయ్యప్పలు



ప్రత్యేక పూజల్లో అయ్యప్పస్వాములు

మర్రిపాడు: మండల రోజుల పాటు అయ్యప్ప స్వామి దీక్షను ఎంతో నిష్ఠతో ఆచరించిన స్వాములు శనివారం శబరిమలకు భక్తిశ్రద్ధలతో కోలాహలంగా బయలుదేరి వెళ్లారు. మండలంలోని పొంగూరు కండ్రికలోని వెంకయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు బయలుదేరారు. స్వాములను శబరిమలకు సాగనంపేందుకు పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తరలివచ్చారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

సోమశిల: అనంతసాగరం మండలం ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా జీ రామిరెడ్డి, అధ్యక్షుడిగా వై రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ బాషా, అసోసియేషట్ ఉపాధ్యక్షులుగా సీహెచ్ తిరుపాలు, ఎస్‌డీ రియాజ్, కరిముల్లా, జి తిరుపతిరెడ్డి, వి.మధుసూదన్‌రావు, అదనపు కార్యదర్శిగా షేక్ సంధాని బాషా తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఆర్ రామసుబ్బారెడ్డి, ఎం రత్నారెడ్డి వ్యవహరించారు.

ఉత్సాహంగా క్రిస్మస్ క్యారల్స్

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని శనివారం క్రీస్తు సంఘం పాస్టర్ ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా క్రిస్మస్ క్యారల్స్ జరిగింది. హిల్‌కాలనీ, ఎస్సీ కాలనీ, చేపల కాలనీ, ప్రాజెక్ట్ కాలనీ మీదుగా క్యారల్స్ సర్వీస్ జరిగింది. కుటుంబాలను సందర్శించి క్రీస్తు జననాన్ని వివరించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు సంఘం పెద్దలు పవన్‌కుమార్, జేమ్స్ శ్రీనివాసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.